ఇంటర్‌లో సత్తా చాటిన బాలికలు


ఆకాంక్ష (929) సీఈసీ


ఆయేషాబేగం (920) ఒకేషనల్ కోర్సు


జాహ్నవి(938) ఎంపీసీ


శ్రీజ (987) సెకండ్ ఇయర్


శ్రీవాణి (986) సెకండ్ ఇయర్


శ్రీలక్ష్మీ(467) ఫస్ట్ ఇయర్


కీర్తి (437) ఫస్ట్ ఇయర్

శేరిలింగంపల్లి: ఇంటర్ ఫలితాల్లో చందానగర్‌లోని మహిళా దక్షత సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుమన్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. మహిళా దక్షత సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్, ప్రిన్సిపాల్ రమాకుమారిలు కళాశాల స్థాయిలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను అభినందించారు. మొదటి సంవత్సరం బైపీసీలో సత్యసాయిమణి 436/440 మార్కులు, ఎంపీసీ విభాగంలో ఆర్.పూజ 448/470 , సీఈసీ విభాగంలో స్టెల్లా 460/500, ఎంఈసీలో జి.వైష్ణవి 444/500, ఒకేషనల్ విభాగంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ ఎస్.సువార్త 476/500, సీఎస్ఈలో కె.పూజ 482/500, ఎంఎల్‌టీలో సవిత 481/500 మార్కులతో టాపర్స్‌గా నిలిచారు. అదే విధంగా ద్వితీయ సంవత్సరం బైపీసీలో ఎన్ ప్రత్యూష 983/1000, జి.సుష్మిత 983/1000, ఎంపీసీలో బి.మంజుభార్గవి 986/1000, సీఈసీలో నాశీన్ 898/1000, ఒకేషనల్ విభాగంలోని ఎంపీహెచ్ డబ్ల్యూ లో లీలావతి 975/1000, సీఎస్ఈలో మదీయ 987/1000, ఎంఎల్‌టీ విభాగంలో శిరీష 972/1000 మార్కులతో టాపర్స్‌గా నిలిచారని బుధవారం వారు వెల్లడించారు.

గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో..

రాయదుర్గం: గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. కళాశాల ప్రిన్సిపల్ శారద బుధవారం ఫలితాలను వెల్లడించారు. కళాశాల నుంచి ఫస్ట్ ఇయర్‌లో 97 శాతం, సెకెండ్ ఇయర్‌లో 99 శాతం సాధించినట్లు వివరించారు.

రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ఇంటర్మీడియట్ ఫలితాలలో రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకెండ్ ఇయర్‌లో 55 శాతం, ఫస్ట్ ఇయర్‌లో 35 శాతం ఫలితాలను సాధించినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు.

గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో..

ఇంటర్మీడియట్‌లో పేదింటి పిల్లలు చదివే గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ప్రభంజనం సృష్టించింది. ప్రిన్సిపల్ వట్టికొండ పాపారావు మాట్లాడుతూ కళాశాల నుంచి 189 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 131 మంది విద్యార్థులు 900 పైగా మార్కులు సాధించారన్నారు. ప్రథమ సంవత్సరంలో 211 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 183 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించారు. ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో 470 మార్కులకు ఎంభరత్ 467, గోపిచంద్ 467, రాజశేఖర్ 466, వివేక్‌కుమార్ 466, జాషువా వివేక్ 466 మార్కులు. అలాగే బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో 440 మార్కులకు గాను సాయిరామ్, ఎంమూర్తి, కే రాజు 437 మార్కులు సాధించారు. కాగా మరో 10 మంది విద్యార్థులు 436 మార్కులు సాధించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయంలో ఎంపీసీలో 100 శాతం ఫలితాలు, బైపీసీలో కూడా 99 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీ సెకెండ్ ఇయర్‌లో 1000 మార్కులలో బి సంజయ్‌కుమార్ 990, డి నీరజ్ తేజ 988 మార్కులు సాధించగా, బైపీసీ సెకెండ్ ఇయర్‌లో శ్రవణ్‌కుమార్ 982, సిద్దార్థ 980 మార్కులు సాధించారని ఆయన వివరించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానించిన రెసోనెన్స్ సిబ్బంది

మాదాపూర్: ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. బుధవారం మాదాపూర్‌లోని రెసోనెన్స్ కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు మెడల్స్ అందించారు. రెసోనెన్స్ హైదరాబాద్ కేంద్రాల డైరెక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో బాలికలు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. రాష్ట్రంలో టాప్ 5లో ఉన్న విద్యార్థులు 186, టాప్ 10లో 443, వివిధ సబ్జెక్టులలో 100శాతం మార్కులు సాధించిన వారిలో 666 మంది ఉన్నారన్నారు. ద్వితీయ సంవత్సరం బైపీసిలో అత్యధిక మార్కులు 982/1000 సాధించారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ ఫలితాలలో 440కి 437 మార్కులు సాధించినట్టు తెలిపారు.

నిర్మాణరంగంపై విద్యార్థులకు అవగాహన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మేరు ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు మైహోమ్ గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం నిర్మాణ పరిశ్రమపై అవగాహన కల్పించారు. మైహోమ్ గ్రూప్ సీనియర్ జీఎం నాగిరెడ్డయ్య విద్యార్థులకు డిజైన్, పర్యావరణ, భద్రత, ప్రణాళిక, నాణ్యతపై వివరించారు. ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్‌లో విజయవంతమైన కెరియర్ కోసం విద్యార్థులనుఒ సిద్ధం చేయడం కోసం మేరు ఇంటర్నేషనల్ స్కూల్, మైహోమ్ గ్రూప్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు.

భెల్ భద్రతపై దృష్టి సారించండి


భెల్ యాజమాన్యం ఓ కాలనీ వద్ద మూసివేసిన గేటు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందనే ఆరోపణలున్నాయి. అనేక క్వార్టర్‌లు ఖాళీగా ఉండటంతోపాటు కాలనీ విస్తీర్ణం ఎక్కువగా ఉండటం అసాంఘిక శక్తులకు ఈ ప్రాంతం కలిసివస్తోంది. ఇతర ప్రాంతాలకు చెందిన వారు దర్జాగా భెల్ కాలనీకు వచ్చి మద్యం సేవించడంతో పాటు ఇతర పనులు చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. పలు ప్రాంతాలు పోకిరీలకు అడ్డాగా మారాయి. భెల్‌కాలనీలో పోలీసు పెట్రోలింగ్ ఉండదు...దీంతో వారంతా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో భెల్ కాలనీ భద్రత సీఐఎస్ఎఫ్ పర్యవేక్షించేది. ఆ సమయంలో బయట వ్యక్తులు కాలనీలోకి రావాలంటే భయపడేవారు. అయితే యాజమాన్యం వారిని తొలగించి బాధ్యతలను భెల్ సెక్యూరిటీకు అప్పజెప్పారు. వారంతా ఉద్యోగ విరమణ చేయడంతో హోంగార్డులకు అప్పజెప్పారు. వీరి పర్యవేక్షణ మాత్రం యాజమాన్యం చూసే విధంగా ఒప్పందం చేసుకున్నారు. ఆసమయంలో కాలనీలో దొంగతనాలు సైతం జరిగాయి. యాజమాన్యం కాలనీలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేయకుండా భెల్ కాలనీను అనుకొని కాలనీలకు వెళ్లే గేట్‌లను మూయడం ప్రారంభించింది. సినిమా షూటింగ్‌ల కారణంగా బయట వ్యక్తులు కాలనీలోకి వస్తున్నారంటూ ఆదాయ వనరులైన సినిమా షూటింగ్‌ల అనుమతులను రద్దు చేశారు. ఇక రాత్రి సమయంలో భెల్ కాలనీలోని బహిరంగ ప్రదేశాలు, చెట్ల పొదల్లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీనిని గమనించిన భెల్ యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. రాత్రి సమయంలో పెట్రోలింగ్‌ను కట్టుదిట్టం చేసింది. ఇప్పటికైనా భెల్ యాజమాన్యం భద్రత పేరిట కాలనీ గేట్లు మూయడం కాకుండా కాలనీలో మరింత భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఒరిజినల్ పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లాలి

ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలను ఒరిజినల్ పత్రాలు చూపించి యజమానులు తమ వాహనాలను తీసుకెళ్లాలని కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గుర్తు తెలియని బైక్‌లు 22 ఉన్నాయని, ఇప్పటికే సంబంధిత వాహనదారులకు రెండుసార్లు పోస్ట్ ఆఫీస్ ద్వారా నోటీసులు పంపామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత వాహనదారులు తమ వాహనానికి సంబంధించిన ఒరిజినల్ పత్రాలు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు చూపించి తీసుకెళ్లాలని కోరారు. లేకపోతే త్వరలో వాహనాలను వేలం వేస్తామని చెప్పారు.

29 నుంచి 'భగవద్గీత' సమ్మర్ క్యాంపు

ఆల్విన్‌కాలనీ: అంతర్జాతీయ ఇస్కాన్ సంస్థ కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మహాశృంగదాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఆర్‌యస్ ఇంటర్నేషనల్ స్కూల్ నందు 29వ తేదీ నుంచి మే 10 వ తేదీ వరకు క్యాంప్ కొనసాగుతుందని పేర్కొన్నారు. భగవద్గీత పారాయణం, ఉపోద్ఘాతం, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సింగింగ్, స్కేటింగ్, స్విమ్మింగ్, గేమ్స్, డ్రామా, దేశభక్తి కథలు, శ్లోకాలు తదితరాల్లో తర్ఫీదు ఇవ్వనున్నారు. రోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం కూడా అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440486792 నంబర్లో సంప్రదించాలని కోరారు.

మే 1నుంచి మ్యూజిక్‌లో శిక్షణ

సాధన మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మే 1 నుంచి 30వ తేదీ వరకు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు డ్యాన్స్, ఓకల్, కీబోర్డు, డ్రమ్స్‌పై శిక్షణ ఇవ్వనున్నారు.

రేగులకుంట చెరువుతో ఆహ్లాదం


దీప్తీశ్రీనగర్ కాలనీలోని రేగులకుంట చెరువును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: చెరువుల సుందరీకరణతో స్థానిక ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందుతుందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీ శ్రీనగర్ కాలనీలో రూ.1.50కోట్లతో సుందరీకరించిన రేగులకుంట చెరువును కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేగులకుంట చెరువును సుందరీకరణకు ముందుకు వచ్చిన సేల్స్ పోర్స్ ఐటీ కంపెనీ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఐటీ సంస్థ ప్రతినిధులు మల్లిగవార్డ్ ఫౌండేషన్ సభ్యులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వర్షపు నీటి కాలువలో మురుగు



రామచంద్రాపురం(సంగారెడ్డి): వర్షపు నీటి కాలువలో డ్రైనేజీ నీరు చేరడంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రనగర్ కాలనీ ఆనుకొని సుమారు గత ఆరు నెలల క్రితం వర్షపు నీరు వెళ్లే కాలువను నిర్మించారు. కాలువ నిర్మించే సమయంలో పక్కనే ఉన్న డ్రైనేజీ పైపులైన్లు పగలగొట్టారు. ఇటు కాంట్రాక్టర్ కానీ అటు మున్సిపల్ అధికారులు కానీ మరమ్మతులు చేయక పోవడంతో పగిలిన డ్రైనేజ్ పైప్లైన్ నుంచి మురుగు నీరు కాలువలోకి చేరుతుంది. పరిసర ప్రాంతవాసులు దుర్వాసన, దోమలతో అనారోగ్యం బారిన పడుతున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కాసానిని అఖండ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తూ వచ్చిందన్నారు. ఈసారి కూడా తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఇద్దరు నేతలకు అవకాశం ఇచ్చిందని ప్రస్తుతం వారు ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని గుర్తు చేశారు. ఆ ఇద్దరిని ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. కేసీఆర్‌ని ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు.

'రేగులకుంట' పునరుద్ధరణకు ఓకే

రాయదుర్గం: రేగులకుంట చెరువు పునరుద్ధరణ లక్ష్యంగా బుధవారం సేల్స్‌ఫోర్స్, మల్లగవాడ్ ఫౌండేషన్ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. రాయదుర్గంలోని దివ్యశ్రీ ఓరియన్ ఐటీ సెజ్‌లోని సేల్స్‌ఫోర్స్ కార్యాలయంలో బుధవారం సేల్స్‌ఫోర్స్ మేనేజింగ్ డైరెక్టర్, ఆపరేషన్స్ సైట్ లీడ్ టెక్నాలజీ ప్రొడక్ట్స్ సంకేత్ అటల్ విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టులో భాగంగా సహజ మురుగునీటిని శుద్ధి చేసి, ఆరువేల మొక్కలు నాటుతామని చెప్పారు. మల్లిగవాడ్ ఫౌండేషన్, యూత్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ వంటి సంస్థలతో భాగస్వామ్యం అనేది సానుకూల మార్పును తీసుకురావడానికి కీలకమైన దశను సూచిస్తుందన్నారు. రేగులకుంటచెరువును పునరుద్ధరించడం సంతోషంగా ఉందని లేక్‌మ్యాన్ ఆఫ్ ఇండియా, మల్లిగవాడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆనంద్ మల్లిగవాడ పేర్కొన్నారు. పట్టణీకరణ, కాలుష్యం, ఆక్రమణ వంటి కారణాల వల్ల నగరంలో నీటివనరులు వేగంగా క్షీణించాయన్నారు.


రేగులకుంట చెరువును శుభ్రం చేస్తున్న దృశ్యం

నాడు కళకళ.. నేడు వెలవెల

- ఎండిపోయిన చెట్లు, మొక్కలతో పార్కులు
- ఐదేళ్లుగా నిర్వహణకు నోచుకోని వైనం
- పట్టించుకోని భెల్ యాజమాన్యం
- పార్కులను అభివృద్ధి చేయాలని కార్మికుల విన్నపం

ఒకప్పుడు పచ్చని చెట్లు, రకరకాల పూల మొక్కలతో ఉద్యానవనాలకు కేరాఫ్ అడ్రస్గా బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ ఉండేది. ఇక్కడి ఉద్యానవనాలు మైసూర్‌లోని బృందావనాన్ని తలపించేవిధంగా కళకళలాడేవి. కానీ.. నేడు ఎండిపోయిన చెట్లు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఫలితంగా భెల్ కార్మికుల కుటుంబాలు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. గతంలో సెంట్రల్‌పార్కు, రాక్‌పార్క్, సుందరవనం పార్కులు పెద్దలు, చిన్నారులతో సందడిగా ఉండేవి. ఈ పార్కుల్లో అనేక సినిమా షూటింగ్‌లు సైతం నిర్వహించేవారు. ఆ తర్వాత భెల్ పరిశ్రమ యాజమాన్యం పార్కుల నిర్వహణను పట్టించుకోకపోవడంతో కళావిహీనంగా మారాయి.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

రామచంద్రాపురం పట్టణంలోని బీహెచ్ఈఎల్ పరిశ్రమ ఏర్పాటు చేసిన తరువాత కార్మికుల కోసం టౌన్‌షిప్‌లో క్వార్టర్స్‌తో పాటు పార్కులను ఎంతో అభివృద్ధి చేశారు. భెల్ టౌన్‌షిప్‌లోని సెంట్రల్ పార్కు, సుందరవనం పార్కులతో పాటు పలుచోట్ల చిన్నపాటి పార్కులను ఏర్పాటు చేశారు. దీంతో ఈ పార్కుల్లో సాయంత్రం సమయాల్లో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సాహంగా గడిపేవారు. గతంలో సెంట్రల్ పార్కు పెద్దలతో, చిన్నారులతో సందడిగా ఉండేది.

కళ తప్పిన రాక్ గార్డెన్

18 ఏళ్ల క్రితం భెల్ చెక్‌పోస్ట్ సమీపంలో లక్షలాది రూపాయలతో రాక్ గార్డెన్ పార్కును అభివృద్ధి చేశారు. అదేవిధంగా జంతువుల బొమ్మలతో వాటర్ ఫౌంటేన్‌తో ఎంతో సుందరంగా ఏర్పాటు చేశారు. క్రమేణా పార్కుల నిర్వహణ విషయంలో యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని పలువురు వాపోతున్నారు.


భెల్ చెక్‌పోస్ట్ సమీపంలో రాక్‌గార్డెన్ పార్కు


పచ్చదనం కనిపించని సెంట్రల్ పార్కు


మూతపడిన సుందరవనం పార్కు

సెంట్రల్ పార్క్‌లో నామమాత్రపు పనులు

ఇటీవల భెల్ సెంట్రల్ పార్కులో పరిశ్రమ యజమాన్యం నామమాత్రంగా పనులు చేపట్టింది. చిన్నారులు ఆడుకునే క్రీడా పరికరాలకు రంగులు వేసి వదిలేసింది. వేలాదిమంది నివసించే భెల్ కాలనీలో సరైన పార్కులు లేకపోవడంతో స్థానికులు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. ఇప్పటికైనా భెల్ టౌన్‌షిప్‌లోని పార్కులను అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకురావాలని స్థానికులు, కార్మికులు భెల్ పరిశ్రమ యాజమాన్యంను కోరుతున్నారు.

నీటి వనరులు ఉన్నా.. నిర్వహణ శూన్యం

కొవిడ్ సమయంలో పార్కులకు తాళాలు వేసిన యాజమాన్యం ఆతర్వాత వాటి నిర్వహణను పూర్తిగా మర్చిపోయింది. 5ఏళ్లుగా భెల్ యాజమాన్యం పార్కులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కళావిహీనంగా మారాయి. భెల్ టౌన్‌షిప్‌లోని సెంట్రల్ పార్క్, సుందరవనం, భెల్ చెక్‌పోస్ట్ సమీపంలోని రాక్‌గార్డెన్‌లోని పార్కుల్లో నీటి వనరులు పుష్కలంగా ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో పార్కుల సంరక్షణపై యాజమాన్యం పట్టించుకోకపోవడంతో చెట్లు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

పాపిరెడ్డి కాలనీలో బీజేపీ ప్రచారం


ప్రచారంలో అభివాదం చేస్తున్న రవికుమార్‌యాదవ్

శేరిలింగంపల్లి: ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీకి ప్రజలంతా అండగా నిలిచి, బీజేపీకి ఓటు వేయాలని ఆ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఎం.రవికుమార్‌యాదవ్ కోరారు. శేరిలింగంపల్లి పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్ప, ఆరంభ టౌన్‌షిప్, నందయ్యనగర్, సురభీ కాలనీలలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా బుధవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభంజనం కొనసాగుతుందని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.ఎల్లేష్, రాజుశెట్టి, రమేష్, నర్సింహ, శ్రీనివాస్, జయలక్ష్మీ, గణేష్, నర్సింగ్‌యాదవ్, నీలకంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ సబ్‌స్టేషన్‌లో 8ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



గచ్చిబౌలి: వేసవి భారం, ఓవర్ లోడ్ నివారించేందుకు కొండాపూర్ సబ్‌స్టేషన్‌లో అదనంగా 8 ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించారు. దీంతో కొండాపూర్, అయ్యప్పసొసైటీ, సెజ్ సబ్‌స్టేషన్ల పరిధిలో వెసులుబాటు కల్గింది. నాణ్యమైన, నిరంతరాయమైన విద్యుత్ సరఫరాతో దాదాపు 45 వేల మంది విద్యుత్ వినియోగదారులు ప్రయోజనం పొందనున్నారు. కార్యక్రమంలో సైబర్‌సిటీ ఎస్ఈ వెంకన్న, కొండాపూర్ డీఈ గరుత్మంత రాజు, ఏడీఈ కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బక్షికుంటను పరిశీలించిన గ్రేటర్ కమిషనర్



శేరిలింగంపల్లి: చందానగర్ సర్కిల్ పరిధిలోని బక్షికుంటను జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌లు బుధవారం పరిశీలించారు. సీఎస్ఆర్ నిధులతో బెంగుళూరుకు చెందిన మల్లిగ్‌వాడ ఫౌండేషన్ అభివృద్ధి చేసిన బక్షికుంటను జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీ వంశీకృష్ణ, చీఫ్ ఇంజనీర్ ప్రాజెక్టు డివిజన్ దేవానంద్, ఈఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ మార్కెట్‌లోకి 'లంక స్పెషల్ స్టీల్స్'

- నగరంలో తొలి ఓవర్సీస్ ఆఫీస్‌ను ప్రారంభించిన ఎల్ఎస్ఎస్ఎల్
- మార్కెట్‌లోకి పొల్ట్రీ 300, ప్రీమియం 100 గాల్వనైజ్డ్ స్టీల్ వైర్స్

సాక్షి, సిటీబ్యూరో: శ్రీలంకకు చెందిన జీఐ వైర్ ఇండస్ట్రీ దిగ్గజం 'లంక స్పెషల్ స్టీల్స్ లిమిటెడ్ (ఎల్ఎస్ఎస్ఎల్) ఆధ్వర్యంలో నగరం వేదికగా తమ బ్రాండ్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా రాడిసన్ హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారతీయ మార్కెట్‌లోకి పౌల్ట్రీ 300, ప్రీమియం 100 అనే రెండు ప్రత్యేకమైన గాల్వనైజ్డ్ స్టీల్ వైర్లను ఆవిష్కరించింది. వీటితో పాటు నగరంలో ఏర్పాటు చేసిన సంస్థ తొలి ఓవర్సీస్ ఆఫీస్‌ను ఈబీ క్రిసీ గ్రూప్ ఛైర్మన్ ఎస్.డి.ఆర్ అరుద్ ప్రగాసం ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుద్ ప్రగాసం మాట్లాడుతూ., లంక స్పెషల్ స్టీల్స్ ఒకప్పుడు టాటా స్టీల్ కంపెనీలో భాగం. 2015లో దాన్ని ఈబీ క్రిసీ, కో.పి.ఎల్.సి కొనుగోలు చేసిందని..ప్రస్తుతం ఇది శ్రీలంకలోని టాటా స్టీల్ గ్లోబల్ వైర్ ఇండియాకు ఏకైక ఏజెంట్‌గా, పంపిణీదారుగా కొనసాగుతోందని అన్నారు. లంక స్పెషల్ స్టీల్స్ ఎన్నో ఏళ్లుగా భారత మార్కెట్‌తో అనుబంధాన్ని కలిగి ఉందని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంతోష్ డిసిల్వా పేర్కొన్నారు. కార్యక్రమంలో సేలం వెల్డ్ మెష్ ఎండీ నటరాజన్, ఉదయ్ సింగ్ బయాస్, చక్రధర్ రావు, గేయన్ పతినాయక తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

రూ.10 లక్షల విలువైన 10,800 లీటర్ల డీజిల్ పట్టివేత
ఏడు చిన్న డీజిల్ ట్యాంకర్లు స్వాధీనం


పోలీసుల అదుపులో ట్యాంకర్ల డ్రైవర్లు

గచ్చిబౌలి: కర్ణాటక నుంచి డీజిల్ స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం తెల్లవారుజామున వట్టినాగులపల్లి శ్రీదేవి ఇంజినీరింగ్ కాలేజీ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కర్ణాటక నుంచి అక్రమంగా తరలించిన డీజిల్‌ను ఉంచినట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి రూ.10 లక్షల విలువైన డీజిల్, ఏడు చిన్న డీజిల్ ట్యాంకర్లను, ఏడుగురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. రాధాకృష్ణ అనే వ్యాపారి కర్ణాటక నుంచి అక్రమంగా డీజిల్ అక్రమ రవాణా చేస్తూ రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్నాడు. డోర్ స్టెప్ డెలివరీ సర్వీస్ నడుపుతున్న సూర్య అలియాస్ సాయి రామ్‌కు అతను డీజిల్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రాధాకృష్ణ రాష్ట్ర వ్యాప్తంగా డీజిల్ సరఫరా చేస్తున్నాడని, అతడిపై పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితులు రాధాకృష్ణ, సూర్య, రితేష్ పరారీలో ఉన్నారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

10.75 లీటర్ల మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: బెల్టు షాప్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అమీన్‌పూర్ సీఐ నాగరాజు అన్నారు. బుధవారం అమీన్‌పూర్ పరిధిలోని జవహర్‌లాల్ కాలనీలో శ్రీకాంత్‌గౌడ్ అనే వ్యక్తి హోటల్లో మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి 10.75 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు శ్రీకాంత్ పై కేసు నమోదు చేశారు.